తొలి విడతలో 105 ఆస్తులకు ముప్పు

కేబీఆర్ పార్కు చుట్టూ భూ సేకరణకు సన్నాహాలు

రేపు స్టాండింగ్ కమిటీ ముందుకు ఆర్‌డీపీ ప్లాన్

తొలుత 3 జంక్షన్ల ఆర్‌డీపీ ప్లాన్

ఆమలు తీసుకువచ్చేందుకు కసరత్తు

సిటీబ్యూరో, జనవరి 21(నమస్తే తెలంగాణ) : కేబీఆర్ పార్కు చుట్టూ వాహనాల రద్దీ నియంత్రణ, వాహనదారులు తేలిగ్గా ముందుకు సాగేందుకు వీలుగా ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణ పనులకు భూ సేకరణ కత్తిమీద సాములా మారింది. హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫార్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (హెచ్ సిటీ) ప్రాజెక్టు కింద రూ. 1090 కోట్లతో ఆరు జంక్షన్లలో 8 స్టీల్ బ్రిడ్జిలు, ఆరు అండర్‌పాస్‌ల నిర్మాణానికిగానూ పరిపాలన అనుమతులు మంజూరు చేసి, ఈ పనులకు ఇప్పటికే టెండర్లు పిలవాల్సిన ఇంజనీరింగ్ విభాగం భూ సేకరణ ప్రక్రియ ఒక్క అడుగు ముందుకు పడకపోవడంతో టెండర్ల ప్రక్రియను తాత్కాలికంగా వాయిదా వేసుకున్నది. కేబీఆర్ పార్కు చుట్టూ వీవీఐపీలు, వీఐపీలు, రాజకీయ, సినీ ప్రముఖుల పెద్దల ఆస్తులు ఉండడం, న్యాయపరమైన చిక్కులు వస్తుండడంతో భూ సేకరణ సంక్లిష్టంగా మారింది. ఈ నేపథ్యంలోనే ఈ ప్రాజెక్టు పనులపై నీలినీడలు కమ్ముకున్న పరిస్థితుల్లో మూడు జంక్షన్లలో రహదారి విస్తరణకు సంబంధించి టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు తాజాగా రోడ్ డెవలప్‌మెంట్ ప్లాన్ (ఆర్‌డీపీ)ని ఖరారు చేశారు. మూడు జంక్షన్లకుగానూ 105 చోట్ల ఆస్తులను స్వాధీనం చేసుకోవాలని నిర్ణయించారు. ఈ మేరకు ఆర్‌డీపీ ప్లాన్‌ను గురువారం మేయర్ అధ్యక్షతన జరిగే సమావేశంలో అధికారులు సభ్యుల ముందు ప్రతిపాదించనున్నారు. సభ్యులు ఈ అంశాన్ని సుదీర్ఘంగా చర్చించి ఆర్‌డీపీ ప్లాన్‌ను ఆమోదించనున్నారు. ఇంజనీరింగ్ విభాగం ఆదేశాల ప్రకారం భూ సేకరణ ప్రక్రియను జరపనున్నారు. భూ సేకరణలో భాగంగా మూడు జంక్షన్ల ఆర్‌డీపీ ప్లాన్ ప్రకారం బసవ తారకం క్యాన్సర్ దవాఖానా జంక్షన్‌లో 33, 36, 60 మీటర్ల మేరలో రహదారి విస్తరించాల్సి ఉంటుంది. ఇందుకు 18 చోట్ల ఆస్తులను స్వాధీనం చేసుకోవాల్సి ఉంటుంది. దీంతో పాటు జూబ్లీహిల్స్ చెక్ పోస్టు జంక్షన్‌లో 33, 45.5, 45 మీటర్లలో రహదారిని విస్తరణలో 47 ఆస్తులు, ముగ్ధ జంక్షన్‌లో 30, 36 మీటర్ల విస్తరణలో భాగంగా 40 ఆస్తులను స్వాధీనం చేసుకోవాలని ఆర్‌డీపీ (రోడ్ డెవలప్‌మెంట్ ప్లాన్)లో ప్రతిపాదించారు.

ప్రముఖుల ఆస్తులకు హెచ్ సిటీ ప్రాజెక్టు గండం

కేబీఆర్ పార్కు చుట్టూ అగ్రసేన్, ఫిలింనగర్, క్యాన్సర్ హాస్పిటల్, జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు, కేబీఆర్ పార్కు ప్రధాన ద్వారం ఇలా ఆరు జంక్షన్లు ఉన్నాయి. ఈ ఆరు జంక్షన్లలో 8 స్టీల్ బ్రిడ్జిలు, ఆరు అండర్‌పాస్‌ల నిర్మాణం జరగనుంది. జూబ్లీహిల్స్ జంక్షన్, కేబీఆర్ ఎంట్రన్స్ జంక్షన్ వద్ద రెండు చొప్పున నాలుగు స్టీల్ బ్రిడ్జిలు రానున్నాయి. మిగతా నాలుగు జంక్షన్ల వద్ద ఒక్కో స్టీల్ బ్రిడ్జి, ఆరు జంక్షన్ల వద్ద ఒక్కొక్కటి చొప్పున ఆరు అండర్‌పాస్‌లు నిర్మించనున్నారు. చిరంజీవి బ్లడ్ బ్యాంకు నుంచి రోడ్డు నెంబరు 45 వైపు వచ్చే ఫ్లై ఓవర్‌పై భాగంలో రెండు లేన్లతో రానుంది. కేబీఆర్ పార్కు నుంచి రోడ్ 36 వైపు వెళ్లే నాలుగు లేన్ల కింద నుంచి వెళ్లనుంది. భూ సేకరణలో భాగంగా కేబీఆర్ పార్కు చుట్టూ రహదారి విస్తరణ చేపట్టాల్సి ఉంది. టీడీపీ కార్యాలయం పక్కన మినహా చుట్టూ రోడ్డుని విస్తరించనున్నారు. వంద ఫీట్ల మేర ఉన్న రోడ్డుని 120 ఫీట్లుగా వైడెనింగ్ చేయనున్నారు. ఈ రహదారి కింద మార్గంలో అండర్‌పాస్‌లు, పైన స్టీల్ బ్రిడ్జిలతో పాటు 120 ఫీట్ల రోడ్డు వస్తుండడంతో కేబీఆర్ పార్కు చుట్టూ ట్రాఫిక్ సమస్యకు అవకాశం ఉండదు. రహదారి విస్తరణకు 87 ఆస్తులను సేకరించనున్నారు. బీఆర్ పార్కు చౌరస్తా నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు మీదుగా రోడ్డు నంబరు 45 బాలకృష్ణ ఇంటివైపు, సీవీఆర్ న్యూస్ చౌరస్తా, భారతీయ విద్యా భవన్స్ స్కూల్ వైపు, అగ్రసేన్ చౌరస్తా, బంజారాహిల్స్ రోడ్ నం 12 వైపు ఈ ఫ్లై ఓవర్లను నిర్మించే ప్రతిపాదనలు రూపొందించారు. ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణం కోసం డిజైన్లు పూర్తి చేశారు. ఎక్కడెక్కడ పిల్లర్లు నిర్మించాలో ఆ ప్రాంతాల్లో మార్కింగ్ పూర్తి చేశారు. ప్రాథమికంగా భూ పరీక్షలు పూర్తయిన తర్వాత పిల్లర్ల నిర్మాణానికి శ్రీకారం చుడతారు. ఐతే ఈ భూసేకరణలో మాజీ మంత్రి జానారెడ్డితో పాటు సినీహీరో ఏపీ ఎమ్మెల్యే బాలకృష్ణలకు చెందిన ఆస్తులకి సంబంధించి కూడా కొంత మేర స్థలం సేకరించనున్నారు. ఇప్పటికే ఈ ప్రాంతాల్లో ఓ దఫా మార్కింగ్ కూడా జరగడం..ఈ ఇద్దరు ప్రముఖులు వ్యతిరేకిస్తున్నారన్న అధికారుల వాదన. ఈ క్రమంలోనే ఈ ప్రాజెక్టు వివాస్పదానికి కేంద్ర బిందువుగా మారనుందనే ప్రచారం ఉంది.

రేపు స్టాండింగ్ కమిటీ సమావేశం

మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ అధ్యక్షతన స్టాండింగ్ కమిటీ సమావేశం గురువారం జరగనుంది. ఈ సమావేశంలో ఎజెండాలోని 15 అంశాలపై సభ్యులు చర్చించనున్నారు. ప్రధానంగా కేబీఆర్ పార్కు చుట్టూ హెచ్ సిటీ ప్రాజెక్టులో భాగంగా ఆర్‌డీపీ ప్లాన్ ఆమోదం, కేబీఆర్‌పార్కు హెచ్ సిటీ ప్రాజెక్టు అంచనా వ్యయం పెంపును ఆమోదించనున్నారు. నారాయణగూడలో మల్టీ మోడల్ మార్కెట్ , ఇతర హెచ్ సిటీ ప్రాజెక్టులకు 227 చోట్ల ఆస్తుల స్వాధీనం, సీఆర్ఎస్ పద్ధతిలో పలు అభివృద్ధి పనులు, నాలా పూడిక తీత పనులు, సీఆర్ఎంపీ పథకం పనుల ప్రతిపాదనలపై చర్చించి ఆమోదం తెలపనున్నారు.



ముచ్చర్ల సత్యనారాయణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వక్తలు

తెలంగాణ వైతాళికుడు ముచ్చర్ల సత్తన్న

కొనియాడిన పలువురు వక్తలు

రవీంద్రభారతి, జనవరి 21: తొలి తరం వాగ్గేయకారుడు, మాజీ మంత్రి దివంగత సంగం రెడ్డి సత్యనారాయణ(ముచ్చర్ల సత్తన్న) తెలంగాణ వైతాళికుడని పలువురు వక్తలు కొనియాడారు. తెలంగాణ సాధనే జీవిత ఆశయంగా తుది వరకు పోరాడిన వ్యక్తి సత్యనారాయణ అని, ఆయన చేసిన సేవలకు సత్యనారాయణ విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని ప్రభుత్వాన్ని కోరారు. రవీంద్రభారతిలోని మెయిన్ హాల్‌లో ముచ్చర్ల సత్తన్న 92వ జయంతిని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వక్తలుగా ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ, సీనియర్ పాత్రికేయులు పాశం యాదగిరి, మాజీ సమాచార కమిషనర్ మాడభూషి శ్రీధర్, ప్రజా గాయకురాలు విమలక్క, జానపద గాయకుడు సోమన్న, సీనియర్ పాత్రికేయులు కప్పర ప్రసాద్, సత్తన్న కుమారుడు పృధ్వీరాజ్ తదితరులు హాజరై సత్తన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సత్యనారాయణ కవి, గాయకుడు, జర్నలిస్ట్, మాజీ మంత్రిగా వివిధ బాధ్యతలు నెరవేరుస్తూనే తెలంగాణ రాష్ట్రం కోసం విశేషంగా కృషిచేశారని తెలిపారు. ఆయన రాసి పాడిన పాటలు ప్రజలను చైతన్యం చేశాయని, తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలను, వివక్షను ఆయన రచనలలో ప్రస్ఫుటంగా కనిపించేవి అన్నారు. ప్రజలను చైతన్యం చేసేందుకు జై తెలంగాణ పత్రికను నడుపుతూ వాటిని ఉచితంగా పంచేవారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అప్పటి ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి 'మామా ఊడుద్ది నీ పైజామా' అని ధైర్యంగా నిలదీసిన ధీశాలి సత్యనారాయణ అని కీర్తించారు. కార్యక్రమంలో జర్నలిస్టు విఠల్, దరువు ఎల్లన్న, గిద్దె రాములు, సత్యనారాయణ కుమారుడు పృధ్వీరాజ్, హేమలతా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వుప్పల నరసింహం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వక్తలు

సబ్బండ వర్గాల రచయిత వుప్పల నరసింహం

అణగారిన వర్గాల వకాల్తాగా పేర్కొన్న పలువురు వక్తలు

రవీంద్రభారతి, జనవరి 21: సబ్బండ వర్గాల తరుపున వకాల్తా పుచ్చుకొని రచనలు చేసిన గొప్ప వ్యక్తి వుప్పల నరసింహం అని పలువురు వక్తలు ఆయన సేవలను కొనియాడారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో వుప్పల నరసింహం సంతాప సభను మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వక్తలుగా బీసీ కమిషన్ మాజీ చైర్మన్ బీఎస్ రాములు, సభా అధ్యక్షుడుగా వుప్పల బాలరాజు, ఆడెపు లక్ష్మీపతి, కుమారస్వామి, అశోక్ కుమార్ తదితరులు హాజరై వుప్పల నరసింహం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీఎస్ రాములు మాట్లాడుతూ వుప్పల నరసింహం రచయితగా, కథకుడిగా తనకు ఎంతో సహకరించారని పేర్కొన్నారు. ఆయన రచనలు కథా శిల్పం దృశ్యీకరణంగా ఉంటుందన్నారు. వుప్పల నరసింహంను నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మరో వక్త కుమారస్వామి మాట్లాడుతూ, సమాజం గురించి రాసే సాహితీవేత్తలు తక్కువని, తన అభిప్రాయం వ్యక్తం చేశారు. అలాంటి నేపథ్యంలో సబ్బండ వర్గాల కోసం నరసింహం రచనలు చేశారని కొనియాడారు. అశోక్ కుమార్ మాట్లాడుతూ నరసింహం బహుముఖ ప్రజ్ఞాశాలి, తెలంగాణ యాసలో మొట్టమొదట రచనలు చేశారని పేర్కొన్నారు. వుప్పల నరసింహం అంత్యక్రియలకు జర్నలిస్టులు, రచయితలు హాజరుకాకపోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో వుప్పల నరసింహం కుటుంబ సభ్యులు, రచయితలు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఆశా వర్కర్లు, సీఐటీయూ నేతలు

ఆశా వర్కర్లకు రూ.18 వేల వేతనం ఇవ్వాలి

మేడ్చల్ కలెక్టరేట్ వద్ద ఆశాల ధర్నా

మేడ్చల్ కలెక్టరేట్, జనవరి 21: ఆశా వర్కర్లకు రూ.18 వేల వేతనం ఇవ్వాలని ఆశా వర్కర్ల సంఘం జిల్లా కార్యదర్శి రేవతి కల్యాణి డిమాండ్ చేశారు. ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని జిల్లా కలెక్టరేట్ ముందు మంగళవారం ధర్నా నిర్వహించారు. అనంతరం, కలెక్టరేట్‌లో అధికారులు సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రాన్ని అందజేశారు. ఆమె మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వ ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైయిందన్నారు. ఆశా వర్కర్లకు ప్రమోషన్ కల్పిస్తూ ఏఎన్ఎం పోస్టులు ఇవ్వాలని, ప్రమాదవశాత్తు మరణిస్తే ఆశాలకు రూ.50 లక్షల పరిహారం, అంతిమ సంస్కారాలకు రూ.50 వేలు, రిటర్మెంట్ బెనిఫిట్స్ రూ.5 లక్షలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు ఉన్ని కృష్ణ, ఆశా వర్కర్ల సంఘం నేతలు వాసంతి, కోమలత, రాజలక్ష్మి, హేమలత, శోభ, రాధ, రేణుక, పల్లవి, మంజుల, విజయ, పుష్ప, పద్మ, సీఐటీయూ నాయకులు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న ప్రదీప్ సింగ్ ఠాకూర్, చిత్రంలో తదితరులు

ట్రంప్ విధానాలకు వ్యతిరేకంగా పోరాడుదాం

సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కమిటీ

చిక్కడపల్లి, జనవరి 21: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా పోరాడుదాం, రష్యా సోషలిస్టు నిర్మాత కామ్రేడ్ లేనిన్ వారసత్వాన్ని కొనసాగిద్దాం అని సీపీఐ(ఎం-ఎల్) మాస్ లైన్ నాయకులు పిలుపునిచ్చారు. సీపీఐ(ఎం-ఎల్) మాస్ లైన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కామ్రేడ్ లెనిన్ శత జయంతి ముగింపు సభను నిర్వహించారు. మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కె.రమ అధ్యక్షతన జరిగిన ఈ సభకు మాస్‌లైన్ మాస్‌లైన్ సెక్రటేరియట్ సభ్యుడు కెచ్చెల రంగయ్య, మాస్ లైన్ ఆలిండియా కార్యదర్శి ప్రదీప్ సింగ్ ఠాకూర్, సెక్రటేరియట్ సభ్యులు కేజీ రాంచందర్, వి.కృష్ణ, ఓపీడీఆర్ నాయకులు భాస్కర్ రావు, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్యలు హాజరయ్యారు. ఈ సందర్భంగా సెక్రటేరియట్ సభ్యుడు కెచ్చెల రంగయ్య మాట్లాడుతూ, వందేండ్లు పూర్తయినా ఈ నాటికీ లెనిన్ రచనలు అనుసరణీయమైనని అన్నారు. కారల్ మార్క్స్ సృష్టించిన కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని, ఆచరణలో నిరూపించిన సోషలిస్టు సమాజాన్ని నిర్మించిన మహాయోధుడు లెనిన్ అన్నారు. మాస్ లైన్ ఆలిండియా కార్యదర్శి ప్రదీప్ సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ అనుసరణీయ, ఆచరణాత్మక, సైద్ధాంతిక కర్త లెనిన్ అన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యలు ఫాసిస్టును సూచిస్తున్నాయన్నారు. సభలో నాయకులు కేజీ రాంచందర్, వి.కృష్ణ, ఎస్ఎల్ పద్మ, వీక్షణం ఎడిటర్ ఎన్.వేణుగోపాల్. ఎం.కృష్ణ, కె.సూర్యం, హన్మేశ్, ప్రభాకర్, బి.రాములు. రామకృష్ణ, ఆవుల అశోక్, జి.రామయ్య, సీవై పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

కథల పోటీలకు ఆహ్వానం

సిటీబ్యూరో, జనవరి 21(నమస్తే తెలంగాణ): జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా కౌమార దశలోని బాల బాలికల కోసం సైన్స్ ఫిక్షన్ కథల పోటీలు జరగనున్నాయి. ఈతరం పిల్లల్లో శాస్త్రీయ దృష్టి, శాస్త్రీయ అవగాహన కలిగించడానికి శాస్త్రీయ ఆలోచనలు, దృక్పథం, శాస్త్రీయ కల్పనలు వంటివి పెంపొందించడానికి ఈ పోటీలు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలో పాల్గొనడానికి 6వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు చదువుతున్న విద్యార్థుల నుంచి రచనలు ఆహ్వానిస్తున్నట్టు పేర్కొన్నారు. దేశంలో ఉన్న ఏ పిల్లలైనా రచనలు పంపొచ్చని వివరించారు. విదేశాల్లో తెలుగు పిల్లలు కూడా పంపొచ్చని పేర్కొన్నారు. నియమ నిబంధనలకు లోబడి తెలుగులో రాసి పంపించాలని సూచించారు. సైన్స్ ఫిక్షన్ కథలను మాత్రమే పోటీలకు పంపాలని తెలిపారు. ఎనిమిది పేజీలు మించకుండా కథ ఉండాలని వివరించారు. ఫిబ్రవరి 20లోపున రచనలు పంపాలని పేర్కొన్నారు. పది ఉత్తమ కథలను ఎంపిక చేసి బహుమతులు అందిస్తామని వెల్లడించారు. మరింత సమాచారం కోసం వి.ఆర్.శర్మ, ఫోన్ నం. 91778 87749, గరిపెల్లి అశోక్ ఫోన్ నం. 98496 49101లను సంప్రదించాలని సూచించారు.

24 నుంచి ఆదివాసీ యువజనోత్సవాలు

జిల్లా యువజన అధికారి కుష్బూ గుప్తా

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న హైదరాబాద్ జిల్లా యువజన అధికారి కుష్బూ గుప్తా తదితరులు

సైదాబాద్, జనవరి 21: కేంద్ర ట్రైబల్, యువజన వ్యవహారాల మంత్రిత్వ శాఖలు, నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ సంయుక్త ఆధ్వర్యంలో రాజేంద్ర నగర్‌లోని కో ఆపరేటివ్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌లో ఈ నెల 24 నుంచి 30వ తేదీ వరకు ట్రైబల్ యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగాం-2025ను నిర్వహిస్తున్నట్లు నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ హైదరాబాద్ జిల్లా యువజన అధికారి కుష్బూ గుప్తా తెలిపారు. సైదాబాద్ ఎస్బీహెచ్ కాలనీలోని తెలంగాణ నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆదివాసీ యువతలో జాతీయ ఐక్యత, సమగ్రతను కాపాడటం కోసం యువతకు వారం రోజుల పాటు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆదివాసీ యుజనోత్సవాల్లో మహారాష్ట్ర, ఛత్తీస్‌ఘడ్, ఝార్ఖండ్ రాష్ట్రాలకు చెందిన 200 మంది యువకులు పాల్గొంటారని, వీరి పాటు వివిధ రక్షణ దళాలకు చెందిన 20 మంది పోలీస్ సిబ్బంది పాల్గొంటారని ఆమె తెలిపారు. ఆదివాసీ సమ్మేళనంలో యువత పరస్పరం తమ అభిప్రాయాలను, ఆలోచనలను వ్యక్తపరుస్తారన్నారు. అదే విధంగా స్వయం ఉపాధి అవకాశాలల్లో శిక్షణ ఇవ్వటం, నగరంలోని వారసత్వ కట్టడాలను సందర్శిస్తారని తెలిపారు. అనంతరం, యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగాం పోస్టర్‌ను ఆమె రాష్ట్ర అదనపు డైరెక్టర్ గంట రాజేశ్, కార్యాలయ సిబ్బందితో కలిసి ఆవిష్కరించారు.

సీపీఆర్ ఉచిత శిక్షణ

బన్సీలాల్‌పేట్, జనవరి 21: గాంధీ మెడికల్ కాలేజీ అలూమ్ని అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగిన ఉచిత సీపీఆర్ శిక్షణా శిబిరానికి ఆరు వేల మంది హాజరయ్యారని, అలూమ్ని అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ జీఆర్ లింగమూర్తి అన్నారు. గుండెపోటు వచ్చిన సమయంలో ప్రాణాలను కాపాడే సీపీఆర్ (కార్డియో పల్మనరీ రెసిస్టేషన్) చేసే పద్ధతిపై నగర పౌరులకు అవగాహన కల్పించి, ఉచిత శిక్షణ, సర్టిఫికెట్లను అందించామని ఆయన తెలిపారు. అంగన్‌వాడి టీచర్లు, ఆశా వర్కర్లు, పారిశుధ్య కార్మికులు, నర్సింగ్ విద్యార్థులు, వివిధ కాలేజీల నుంచి వచ్చిన విద్యార్థులు, ఆటో, అంబులెన్స్ డ్రైవర్లు, వీధి వ్యాపారులు పాల్గొన్నారు. గాంధీ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ రాజకుమారి, గ్లోబల్ అలయెన్స్ అధ్యక్షుడు డాక్టర్ రవీందర్ సురకంటి, ప్రతినిధులు డాక్టర్ మహేశ్వర్ రెడ్డి, డాక్టర్ కె.రాజశేఖర్, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ డెన్నిస్ మెకాలే (చికాగో), డాక్టర్ రోహిత్, జనహిత సేవా ట్రస్ట్ ప్రతినిధి నర్సింహమూర్తి, వలంటీర్లు పాల్గొన్నారు.

ఓయూ అభ్యున్నతికి సహకరిస్తాం

వీసీ ఆచార్య ఎం. కుమార్‌ను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థి సంఘ అధ్యక్షులు, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు

సికింద్రాబాద్, జనవరి 21: ఉస్మానియా యూనివర్సిటీ అభివృద్ధికి అవసరమైన అన్ని రకాలుగా సహకరిస్తామని ఓయూ పూర్వ విద్యార్థులుగా, విద్యార్థి సంఘ ప్రతినిధులు అన్నారు. 1977 నుంచి 1988 వరకు ఓయూ విద్యార్థి సంఘానికి ప్రాతినిధ్యం వహించిన పలువురు పరిపాలనా భవన్‌లో ఉప కులపతి ఆచార్య కుమార్ మొలుగారం, రిజిస్ట్రార్ ఆచార్య జి.నరేశ్ రెడ్డి, ఓఎస్డీ ఆచార్య జితేందర్ నాయక్‌తో భేటీ అయ్యారు. ఉస్మానియా విశ్వవిద్యాలయ పూర్వ అధికారిక విద్యార్థి సంఘ అధ్యక్షులు, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు ఉప కులపతి ఆచార్య కుమార్ మొలుగారంను మంగళవారం ఘనంగా సత్కరించారు. పూర్వ విద్యార్థులుగా, విద్యార్థి సంఘ ప్రతినిధులుగా ఓయూ అభ్యున్నతికి అవసరమైన సహకారాన్ని అందిస్తామని ఈ సందర్భంగా ప్రతిపాదించారు. ఓయూకు పునర్వైభవం తీసుకురావటంతో పాటు ఓయూ కున్న ఖ్యాతి, ప్రపంచ స్థాయి గుర్తింపును కాపాడుకోవాలని ఆకాంక్షించారు. అకడమిక్ ఎక్సలెన్స్, ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్, మెరుగైన మౌలిక వసతుల కల్పన, విద్యార్థులకు సహకారం, పూర్వ విద్యార్థుల భాగస్వామ్యం, ఓయూతో పరిశ్రమల భాగస్వామ్యం, సుపరిపాలన, ప్రమోషన్ అండ్ బ్రాండింగ్, నైతిక విలువలు, ఆర్థిక సహకారం తదితర అంశాల్లో మెరుగుదల కోసం తగిన చర్యలు చేపట్టాలని పూర్వ విద్యార్థి సంఘ నాయకులు కోరారు. ఓయూలో విద్యార్థి సంఘ ఎన్నికలు నిర్వహించేందుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఓయూ సమగ్రాభివృద్ధిలో పూర్వ విద్యార్థులు భాగస్వామ్యం కావాలని వీసీ కుమార్ కోరారు. విద్య, పరిశోధన, రాజకీయాల్లో ఓయూ క్రియాశీలకంగా ఉండేదని అలనాటి జ్ఞాపకాలను ఓయూ అధికారులతో పూర్వ విద్యార్థి నాయకులు పంచుకున్నారు. సహాయ సహకారాలు అంచేందుకు తమ శాయాశక్తుల కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డా. బాలస్వామి, తదితరులు

రేషన్ ద్వారా కోడిగుడ్లు సరఫరా చేయాలి

ఎన్ఈసీపీసీ అధ్యక్షుడు డాక్టర్ బాలస్వామి

ఖైరతాబాద్, జనవరి 21: సామాన్య ప్రజలకు పౌష్టికాహారాన్ని అందించేందుకు కోడిగుడ్లను రేషన్ షాపుల్లో సరఫరా చేయాలని నేషనల్ ఎగ్ అండ్ చికెన్ ప్రమోషన్ కౌన్సిల్ (ఎన్ఈసీపీఐ) అధ్యక్షులు డాక్టర్ బాలస్వామి కోరారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఎన్ఈసీపీసీ నూతన సంవత్సర క్యాలెండర్‌ను నేషనల్ ఎగ్ కార్పొరేషన్ (ఎన్ఈసీ) జోనల్ చైర్మన్ శేఖర్ రెడ్డి, ఉపాధ్యక్షులు సంజీవ్ రెడ్డి, తెలంగాణ పౌల్ట్రీ ఫెడరేషన్ అధ్యక్షులు మోహన్ రెడ్డి, ఇండియన్ పౌల్ట్రీ ఫెడరేషన్ సౌత్ జోన్ ఉపాధ్యక్షులు తారా సుబ్రహ్మణ్యం, పౌల్ట్రీ ఇండియా డైరెక్టర్ చక్రధర్ రావు, అధ్యక్షులు ఉదయ్ సింగ్‌తో కలిసి ఆయన ఆవిష్కరించారు. బాలస్వామి మాట్లాడుతూ కోడిగుడ్లలో కొలెస్ట్రాల్ అధికంగా ఉంటుందనేది అపోహ అని, రోజుకు కనీసం రెండు నుంచి ఆరుగుడ్లు తింటే రోగ నిరోధక శక్తి పెరగడంతో పాటు చెడు కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గిస్తుందని, మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతుందన్నారు. రక్తపోటు, మధుమేహం అదుపులో ఉంటుందని, క్యాన్సర్ వచ్చే అవకాశాలు కూడా తగ్గుతాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే మధ్యాహ్న భోజన పథకంతో పాటు పిల్లలు, గర్భిణులకు గుడ్లు అందించేలా పథకం రూపొందించాలని, ఆహార పథకంలో పనిచేస్తున్న వారికి నెలకు 30 గుడ్లు అందించాలన్నారు.

ప్రజాదరణ పథకాల ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదే

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్

రహ్మత్‌నగర్‌లో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ..

అర్హులందరికీ రేషన్ కార్డులు అందేలా చర్యలు

రహ్మత్‌నగర్‌లో సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్

జూబ్లీహిల్స్, జనవరి 21: తెలంగాణ రాష్ట్రంలో ప్రజాదరణతో పాటు ఉపాధి కల్పించిన పథకాలు అమలుచేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ పేర్కొన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పేదలకు అవసరమైన అనేక పథకాలను ఎన్నికల హామీలతో సంబంధం లేకుండా ప్రవేశపెట్టారని ఉద్ఘాటించారు. రహ్మత్‌నగర్ డివిజన్‌లో 14 మంది సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు రూ.5,97,500/- విలువైన చెక్కులను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పేదింట్లో పెళ్ళిళ్ళకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, గర్భిణులకు కేసీఆర్ కిట్, అన్నదాతకు రైతు బంధు వంటి అన్ని వర్గాల ప్రజల ఆదరణ పొందిన విన్నూత్న పథకాలను ప్రవేశపెట్టడంతో పాటు ఆసరా ఫెన్షన్లు రూ.200 నుంచి రూ.2 వేలకు పెంచిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఈ పథకాలపై ప్రజలకు ఉన్న ఆదరణే బీఆర్ఎస్ పార్టీని మళ్ళీ అధికారంలోకి తెస్తుందని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నాగరాజ్, అరుణ్, చోటు, అహ్మద్ పటేల్, వాజీద్, లియాకత్, బషీర్, రాకేశ్ క్రిష్టోఫర్, కేఎన్ రెడ్డి, వినోద్, రమేశ్, రాజ్ కుమార్, రాకేశ్, తరుణ్, రఘు, విజయ్, జగన్, ప్రవంతి, రమాదేవి, సునీతాదేవి, దుర్గాదేవి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు అందేలా చర్యలు తీసుకుంటామని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ పేర్కొన్నారు. మంగళవారం రహ్మత్‌నగర్ డివిజన్‌లో కొత్త రేషన్ కార్డుల పరిశీలన కార్యక్రమం నిర్వహించారు. పేదలందరికీ ఆహార భద్రత కార్డులు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సివిల్ సప్లైస్ ఏఎస్ఓ జ్యోతి, సివిల్ సప్లై ఇన్‌స్పెక్టర్ విక్రమ్, ఇతర అధికారులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 20న యాభయ్యేండ్ల విప్లవ విద్యార్థి సదస్సు

ఖైరతాబాద్, జనవరి 21: ఐదు దశాబ్దాల విప్లవ విద్యార్థి ఉద్యమ స్ఫూర్తితో విద్యారంగ సమస్యలపై నేటి విద్యార్థి సంఘాల గళమెత్తాలని వక్తలు పిలుపునిచ్చారు. విప్లవ విద్యార్థి సంఘాల పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఫిబ్రవరి 20, 21 తేదీల్లో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'ఉభయ రాష్ట్రాల యాభయ్యేండ్ల విప్లవ విద్యార్థి ప్రస్థానం' పేరుతో నిర్వహించనున్న సదస్సు పోస్టర్లను మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ప్రొఫెసర్ హరగోపాల్, రచయిత రాజేంద్రబాబు, సీనియర్ జర్నలిస్టు హరగోపాల్, సజయ, సుధాతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 70, 80 దశకాల్లో విశ్వవిద్యాలయాలు, విద్యాలయాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారంలో విప్లవ విద్యార్థి సంఘాల పాత్ర ఎంతో విశేషమైనదన్నారు.

ధర్నాలో నినదిస్తున్న ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు

పోడు భూములకు హక్కు పత్రాలివ్వాలి

మాజీ ఎంపీ డాక్టర్ మిరియం బాబూరావు

కవాడిగూడ, జనవరి 21: కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం, సాగులో ఉన్న ప్రతి ఎకరానికి హక్కు పత్రం ఇవ్వాలని, అందుకు ప్రభుత్వం రోడ్ మ్యాప్ ప్రకటించాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, భద్రాచలం మాజీ ఎంపీ డాక్టర్ మిరియం బాబూరావు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఇందిరా పార్కు వద్ద మహా ధర్నా నిర్వహించారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాలో పాల్గొన్న మిరియం బాబూరావు మాట్లాడుతూ ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర స్థాయిలో గిరిజన సలహా మండలి(టీటీఏసీ) సమావేశాలు, జిల్లా స్థాయిలో ఐటీడీఏ పాలకమండలి సమావేశాలు నిర్వహించి, అసెంబ్లీలో ప్రత్యేక చర్చ చేపట్టాలన్నారు. ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో దశాబ్దాల నుంచి నివసిస్తున్న ఎస్టీ కోయ ఆదివాసీ షెడ్యూల్ తెగలకు చెందిన గొత్తికోయ ఆదివాసీలకు కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడం లేదన్నారు. పుట్టుకతో ఆదివాసీలు అయినప్పటికీ ఎలాంటి ప్రభుత్వ పథకాలు వీరికి అందడం లేదన్నారు. రైతు రుణమాఫీ ఆదివాసీలకు అందకపోవడానికి కారణమైన అవకతవకలను సరిచేసి న్యాయం చేయాలన్నారు. తప్పు చేసిన వ్యవసాయ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ డీఎస్సీని ప్రకటించి ఏజెన్సీ ప్రాంతంలో ఖాళీగా ఉన్న అన్ని పోస్టులను భర్తీ చేయాలన్నారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ ధర్నాకు మద్దతు పలికారు.